

# పరిష్కారం

-కాకాని చక్రపాణి

"బోడ్! తమరి కంత సీన్ లేదు. నన్ను అపాయింట్ చేసింది మన ఢిల్లీ ఆఫీసు. ఊస్టింగ్ చేసే అధికారమూ వాళ్ళకే ఉంది. నా ఊస్టింగుకు రికమెండ్ చేసే అధికారం మాత్రమే మీకుంది. అయినా ఏమని రికమెండ్ చేస్తారు - నా డబ్బు నేను ఖర్చు పెట్టుకుంటున్నాననా? పై ఆఫీసులో ఆ మాట వింటే మీరే నవ్వుల పాలవుతారు."

సాయంత్రం నాలుగ్గంటలయింది. మా ఆఫీసరు నన్ను పిలుస్తున్నాడంటే ఆయన ఛేంబర్‌లోకి వెళ్ళాను. ఆయన నన్ను చూసి, "కూర్చో. నీతో మాట్లాడాలి" అన్నాడు గంభీరంగా.

'ఈ తిక్క మనిషికి నాతో మాటలేమిటా?' అనుకుంటూ కూర్చున్నాను ఆయన ఎదురుగా ఉన్న కుర్చీలో. అంతే కదండీ. కాస్తంత తిక్కయినా లేకపోతే ఆఫీసర్లు ఎలా అవుతారు. నేను కాలేదే మరి!

"చూడు. మన ప్రవర్తన ఇతరులు వేలెత్తి చూపేట్టుండకూడదు. నీ వ్యవహారమేం బాగా లేదు. ఎవర్నో ఇంటో తెచ్చి పెట్టుకుని, దీని కోసం నీ జీతమంతా ఖర్చు చేస్తున్నావట? అసలు ఆ నందిని ఎవరు? మొన్న మీ ఆవిడ బజార్లో కనబడి నా దగ్గర తన బాధలన్నీ మొరపెట్టుకుంది. పిల్లల కనీస అవసరాలకు కూడా నువ్వు డబ్బు ఇవ్వటం లేదట! నువ్విలా ప్రవర్తిస్తుంటే నీ మీద క్రమశిక్షణా చర్య తీసుకోవల్సి ఉంటుంది..." అంటూ ఆయన ఇంకేమో మాట్లాడసాగాడు.

మా ఆఫీసర్ ఇలాంటి పిచ్చికూతలేవో కూస్తూంటాడు. మామూలే! ఇంక ఆయన్ని పట్టించుకోవల్సిన అవసరం లేదనిపించింది. అంతకంటే అత్యవసరమయిన వ్యవహారం నాకు ఆయన టేబుల్ మీద కన్పించింది. టేబుల్ మీద ఓ దోమ వాలి ఉ[illegible] అది వెనక కాళ్లను కదిలిస్తోంది. అంటే, టేకాఫ్‌కు ఆయత్త మ[illegible]న్న మాటే. మా ఆఫీసరు బట్టతల లాండవటానికి అనువైన ప్రదేశమే అన్పించింది. అయితే, ఆ పీఠభూమి మీద దానికి లాండవటానికి ఇష్టం ఉన్నట్టు లేదు. అనువైన ప్రదేశమేమిటా అని ఆలోచిస్తున్నట్టుంది. ఉన్నట్టుండి లేచి ఆయన చెయ్యి మీద వాలింది. అంత ఆఫీసరునూ అని లెక్క చెయ్యలేదు. దాని సాహసానికి మురిసిపోయాను. ఉన్నట్టుండి దుర్మార్గుడు ఠక్కున మరో చేత్తో చరిచాడు. పాపం రక్తం కక్కుకుంటూ చచ్చిపోయింది. హంతకుడు?

"ఏం మాట్లాడవు?" అని ఆయన ప్రశ్నించటంతో నేను ఉలిక్కిపడి, ఇహలోకానికి వచ్చాను.

"ఇప్పుడు మీరు దారుణంగా హత్య చేసిన దోమ ఉందే, దాని కాటువల్లే చికున్ గన్యా, డెంగ్యూ వ్యాధులు వస్తున్నాయంటున్నారు. అది పగటి దోమ. దోమలను చంపి ప్రయోజనం లేదు. జీవకారుణ్యం ఉండాలి. అలాంటి దోమలు మన ఆఫీసులో సంచరించకుండా అరికట్టే చర్యలు చేపట్టటం మన తక్షణ కర్తవ్యం" అన్నాను నేను లేచి, పనయిపోయిందని బయలుదేరబోతూ.

"ఏం మాట్లాడుతున్నావో జ్ఞానముందా? నేనడిగేదేమిటి, నువ్వు చెప్పేదేమిటి?" అన్నాడాయన మహా సీరియస్‌గా.

ఇంక లాభం లేదు. పెద్దమనిషి శృతిమించిపోతున్నాడు. ఈయనకో డోసు ఇవ్వవల్సిందే.

"నా జీతం నా ఇష్టమొచ్చినట్టు ఖర్చు చేసుకుంటాను. ఇందులో తమరి జోక్యం అనవసరం. నా పర్సనల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే నేను సహించను. దిసీజ్ ద లాస్ట్ అండ్ ఫైనల్ వార్నింగ్" అన్నాను.

అంతే, మండిపడిపోయాడు ఆయన. అలా నేను అన్నందుకు ఆయన కోపగించాల్సిన పనేం ఉంది?

"నిన్ను ఊస్టు చేస్తున్నాను" అన్నాడు దురాగ్రహంతో.

"బోడ్! తమరి కంత సీన్ లేదు. నన్ను అపాయింట్ చేసింది మన ఢిల్లీ ఆఫీసు. ఊస్టింగ్ చేసే అధికారమూ వాళ్ళకే ఉంది. నా ఊస్టింగుకు రికమెండ్ చేసే అధికారం మాత్రమే మీకుంది. అయినా ఏమని రికమెండ్ చేస్తారు - నా డబ్బు నేను ఖర్చు పెట్టుకుంటున్నాననా? పై ఆఫీసులో ఆ మాట వింటే మీరే నవ్వుల పాలవుతారు. సరే, మీతో తగాదా పెట్టుకోటం నా ఉద్దేశం కాదు. ప్రతి వ్యక్తితోనూ సామరస్యంగా వ్యవహరించటం నా జీవిత లక్ష్యం. చెప్పిన మాటే చెప్తున్నాను. ఏమనుకోవద్దు..."

బుర్రపోయి ఏమిటన్నట్టు ఆయన నా వంక చూశాడు.

"మన ఆఫీసులో చికున్ గన్యా, డెంగ్యూ కారక దోమలను నివారించే ప్రయత్నం చెయ్యండి. అది మీకూ నాకూ క్షేమంకరం" అన్నాను నేను ప్రశాంతంగా.

ఎవరో ఏదో అన్నారని మనం బుర్ర పోగొట్టుకోకూడదని నేనెప్పుడో నేర్చుకున్నాను. ఆయన నా మాటలు విని అవాక్కయిపోయాడు.

నేను ఆఫీసు నుండి ఇంటికొచ్చేసరికి ఆరుగంటలయింది. నందిని అంటే నాకెంతో ఇష్టం. నందినీ నేనంటే పడి చస్తుంది. అలసిపోయి వచ్చి సోఫాలో కూలబడగానే, అప్పటిదాకా బిక్కచచ్చిపోయి ఉన్నట్లు కన్పించిన నందిని ఉత్సాహంగా నా దగ్గరకు

వచ్చింది. నేను దాన్ని అక్కున చేర్చుకుని ముద్దు పెట్టుకున్నాను. అదీ నా నుదురు ముద్దుపెట్టుకుంది.

నందినిలో ఏకాంతంగా కాస్తంతసేపు గడిపే అవకాశం మా కొంపలో లేదు. ఇంతలో మా శత్రుగణం డ్రాయింగ్ రూంలోకి ప్రవేశించింది.

మమ్మల్ని చూసి మా ఆవిడకు కడుపుడికిపోయింది. "హవ్వ! పబ్లిక్‌గా ఏవిటా ముద్దులు? సిగ్గులేకపోతే సరి! జనం నవ్విపోతారన్న జ్ఞానమయినా ఉండాలి" అంది.

"నన్నేన్నా నేను సహిస్తాను గానీ, నందినినేమీ అనకు. నీకా హక్కు లేదు" అన్నాను నేను.

'నాకా తేడా లేదు. ఇద్దర్నీ అంటాను" అంది, నా ఎదుట సోఫాలో కూర్చుంటూ. ఆమె వెనక, సోఫా మీద చేతులు ఆన్చి నిలబడి నా పుత్రుడూ, పుత్రికారత్నం మా వంక గుర్రుగా చూస్తున్నారు.

"యాచకోయాచకః శత్రుః అని ఊర్కే అనలేదు" అని అంటించాను. నిజానికంతటి చక్కటి సంస్కృత సమాసం దొరికినందుకు నన్ను నేను అభినందించుకున్నాను.

మా ఆవిడ నాలో ఏ గొప్పదనం ఉన్నా సహించలేదు. భార్యలందరూ కూడా అంతేనని నా సదభిప్రాయం.

"అంటే ఏమిటి?" అనడిగింది.

"ఏమో? సంస్కృతం మాటలకు అర్థాలు అడక్కూడదు. సంస్కృతం దేవభాష. ఆ భాషా పదాలకు అర్థం తెలుసుకో ప్రయత్నించటం దైవాపచారమని మా బామ్మ చెప్పింది. నువ్వు రోజూ పూజ చేస్తావు. ఆ శ్లోకాలకు అర్థం తెలిసే చదువుతున్నావా?" అని, నా తార్కిక జ్ఞానమంతా ప్రయోగించి ఆమె నోరు మూయించాలని ప్రయత్నించాను.

కానీ, మా ఆవిడ తీరే వేరు. వెనకటికి కాపురానికి వచ్చిన కొత్త కోడల్ని, "ఏం పెట్టి పంపించారే, నీ పుట్టింటివారు?' అని అత్తగారు అడిగితే, ఆ పిల్ల, "ఏం పెట్టి పంపిస్తారు? నోరు పెట్టి పంపించారు" అందట! అలా మా ఆవిడా కాపురానికి వస్తూ నోరు అరణంగా తెచ్చుకుంది.

"తెలియకపోతే తెలుసుకునే ప్రయత్నమయినా చెయ్యాలి. లేకపోతే వాటిని ప్రయోగించటం మానుకోవాలి. నువ్వన్నమాటకు అర్థం - బిచ్చగాడు బిచ్చగాడికి శత్రువని. అంటే, నేను అడుక్కునేదాన్నా! నేను స్కూల్లో పిల్లలకు పాఠాలు చెప్పి, నా జీతం నేను తెచ్చుకుంటున్నాను. నా తిండి నేను తింటున్నాను. నువ్వు సంపాదించేదంతా దీని భోగాల కిందే ఖర్చు పెడుతున్నావు. నా జీతం రాళ్ళుండబట్టే సంసారం గడిచిపోతున్నది. అందుకు కృతజ్ఞత లేకపోగా నన్ను యాచకురాలితో పోలుస్తావా? నీకు సిగ్గూ, ఎగ్గూ లేవు. తెలిసే కూశావు. నీ పిచ్చికూతలు భరించటానికి నేను పాతకాలం ఆడదాన్ని కాదు" అంటూ బడబడా ఎన్నో మాటలు దొర్లించేసింది, అంట్లు తోముతూ గిన్నెలు పడేసినట్టు.

పాపం, నందినీ, నేనూ బిక్కచచ్చిపోయినట్టు చూస్తూ ఉండిపోయాం.

ఇంక మా అమ్మాయి అందుకుంది. "నాన్నా! నాకూ ఓ సెల్‌ఫోను కొనిపెట్టు. మా ఫ్రెండ్సందరికీ సెల్లుంది. అంతా నన్ను చూసి నవ్వుతున్నారు. నాకెంతో చిన్నతనంగా ఉంది" అంది.

ఇంటర్మీడియెట్ చదివే పిల్లకు సెల్లెందుకు?! దానికి సమర్థయించి చెప్పాలని నడుం బిగించాను. "మనం అంత ఖర్చు పెట్టే స్థితిలో లేమమ్మా! ఆదాయానికి తగినట్లు ఖర్చు పెట్టుకోవాలి. కట్ యువర్ కోట్ అకార్డింగ్ టు యువర్ క్లాత్ - అని ఆ ఇంగ్లీషు మహానుభావుడెప్పుడో చెప్పాడు. సింపుల్ లివింగ్ అండ్ హై థింకింగ్ అన్నారు..."

అయితే, మా అమ్మాయి నన్ను అడ్డుకుంది. "ఆ. దాని కైతే ఎంతయినా ఖర్చు పెడ్తావు! సోపులు, సెంట్లు, పెడిగ్రీలు - అన్నీ పట్టుకు వస్తావు. నా ఖర్మకాలి నీ కూతురిగా పుట్టాను" అంది. దాని కంఠం రుద్ధమైంది. ఆఖరి అస్త్రం ప్రయోగించటానికి సిద్ధంగా ఉంది.

"అదీ అట్టా బుద్ధి చెప్పు మనిషికి! చివరకు కన్న పిల్లలచేతే గడ్డి పెట్టించుకునే స్థాయికి దిగజారిపోయాడు మీ నాయన!" అంది మా ఆవిడ.



నాకప్పుడు నిజంగానే కోపమొచ్చింది., "నామీద మా ఆఫీసరుకు కంప్లెయింట్ చేస్తావా? నీకెంత ధైర్యం?" అని ఆమె ముఖం మీదే అడిగేశాను. నాకు శషభిషలు పనికిరావు.

"చేస్తాను. నువ్వు మమ్మల్నిలా హింసిస్తుంటే ఎవరికైనా ఫిర్యాదు చేస్తాను. గృహహింసకు వ్యతిరేకంగా కొత్తగా ఏదో చట్టం కూడా వచిచందట! సామ, దాన, భేదోపాయాలు ఫలించకపోతే దండోపాయం కూడా ప్రయోగించక తప్పదు. మావగారికీ, అత్తగారికీ కూడా ఉత్తరాలు రాస్తాను. మా తమ్ముడి కెలాగో కబురు చేశాను. రెండు మూడు రోజుల్లో వాడొచ్చి నీ సంగతేమిటో తేలుస్తాడు" అందామె నిర్భయంగా.

"ఏమో? సంస్కృతం మాటలకు అర్థాలు అడక్కూడదు. సంస్కృతం దేవ భాష. ఆ భాషా పదాలకు అర్థం తెలుసుకో ప్రయత్నించటం దైవాపచారమని మా బామ్మ చెప్పింది. నువ్వు రోజూ పూజ చేస్తావు. ఆ శ్లోకాలకు అర్థం తెలిసే చదువుతున్నావా?"

ఇలా చట్టాలు తెచ్చి ప్రభుత్వం ఆడవాళ్ళ బరి తెగించేటట్టు చేస్తోంది. అయితే, ఆమె తమ్ముడు వస్తున్నాడన్న వార్త విని నేను బేజారయిపోయాను. గణపతి వంటరిగా రాడు. వాళ్ల నాయన వరహామూర్తిని కూడా వెంట పెట్టుకు వస్తాడు. వాళ్లు వచ్చారంటే కనీసం పది రోజులయినా ఇంట్లో తిష్ఠ వేస్తారు. వాళ్ల ఖర్చు భరించటం నా వల్ల కాదు.

"మనకు సమస్యలుంటే మనం సామరస్యంగా పరిష్కరించుకోవాలి. ఇందులో ఇతర్ల జోక్యం అనవసరం" అన్నాను నేను దిగిపోతూ.

"ఇతర్లెవరు? మా నాన్నా, తమ్ముడూ పరాయివాళ్ళా?" అంది మా ఆవిడ.

"మనం ఐదుగురం తప్ప, మిగతా వాళ్ళంతా పరాయి వాళ్ళే" అన్నాను నేను.

"నందిని కూడా మాలో ఒకటి మేం భావించం" అంది నా కూతురు.

ఇంక నా కొడుకు నోరు విప్పాడు. ఇంజనీరింగ్ చదువుతున్నాడు కానీ వాడి గుండెలో అణుమాత్రం దయాదాక్షిణ్యాలు లేవు.

'ఓకే డాడీ! ఈ విషయంలో డిస్కషన్స్ అనవసరం. ఈ ఇంట్లో నందిని అయినా ఉండాలి. మేమయినా ఉండాలి. ఎవరు ఉండాలో నువ్వే తేల్చుకో" అన్నాడు.

"ఒరే బాబూ! ఉడుకు రక్తంతో నువ్వేమంటున్నావో నీకు తెలియటంలేదు. మే గాడ్ ఫర్గివ్ యు! కన్నతండ్రికే అల్టిమేటం ఇచ్చే స్థాయికి ఎదిగిపోయావా? పిదప కాలం" అన్నాను ఉస్సురంటూ.

"అంతే నాన్నా! నీ ఆగడాలను భరించలేం. బోడి సెల్‌ఫోను కొనమంటే 'సింపుల్ లివింగ్, హై థింకింగ్' అంటూ చచ్చు లెక్చర్లిచ్చావు. మేం కాలేజీలో లెక్చర్లకే బోరుకొట్టి ఛస్తుంటే, ఇంటి దగ్గరా నీ లెక్చర్లు వినాలా? మనశ్శాంతి కరవై విద్యార్థినులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే, కారణం ఆ కాలేజీలూ, నీలాంటి తండ్రులూ!" అంది మా అమ్మాయి.

మా ఆవిడ నా ఎదురుగా సోఫాలో కూర్చుని మహదానందంగా తన పిల్లల వంక ప్రశంసాపూర్వకంగా చూస్తోంది. నా పిల్లల్నే నాకు శత్రువులుగా తయారుచేసిన దేవాంతకురాలు! మొగుణ్ణి కొట్టి మొగసాలకెక్కిన బాపతు మనిషి! ఈ విషయంలో ఆమె అభిప్రాయ మడగటమంత బుద్ధి తక్కువ పని మరొకటుండదు. ఆఫీసులో అలసిపోయి వచ్చిన మొగుడికి గుక్క కాఫీ నీళ్లయినా పోద్దామన్న ఆలోచన ఆ మనిషికి లేదు. పెళ్ళి చేసుకోటమంత మహాపాపం మరోటి లేదని నాకన్పించింది.

"మీరు చెప్పినంత తేలిగ్గా సమస్య పరిష్కారం కాదు. నేను నందిని విడిచి ఉండలేను" అన్నాను.

"విడవకపోతే దాన్తో కట్ట కట్టుకుని ఊరేగు" అంది మా ఆవిడ కోపంగా లేచిపోతూ.

అంతలో నా పక్కన కూర్చున్న నందిని కక్కుకుంది. నేను గాబరా పడిపోయాను. పాపం తనకి వేవిళ్లు!

"ఛీ! పాడు కుక్క! ఎక్కడ తిరిగొచ్చి కడుపు తెచ్చుకుందో! ముందదంతా శుభ్రం చెయ్యి. నా వల్ల కాదు" అంది మా ఆవిడ ఛీదరించుకుంటూ.

"తప్పు! గర్భవతిని అలా అనకూడదు. డాక్టరు దగ్గరకు తీసుకువెళ్తాను. పాపం, తొలిచూలు! దాని ఒంట్లో ఎలా ఉందో ఏమో!" అన్నాను నేను లేస్తూ.

"దానికేం మాయరోగం! బాగానే ఉంటుంది. దాన్ని కాదు, నువ్వు వెళ్ళి మెంటల్ డాక్టరుకు చూపించుకో. నీ రోగం కుదిర్తే మా ప్రాణం హాయిగా ఉంటుంది" అంది మా ఆవిడ.

చూశారుగా గృహహింస! మొగవాళ్ళు కూడా ఇంట్లో వేధింపులకు గురవుతారని ఈ శాసనకర్తలకు ఎందుకు తోచలేదో! నేను సృజించుకున్న ప్రపంచమే నాకు శత్రువయిపోయింది. సమస్యకు పరిష్కారం వెతకాలి. గణపతి వచ్చాడంటే మరీ ప్రమాదం. లేచి, నందిని కక్కుకున్న జాగానంతా తుడిచి శుభ్రం చేశాను.

నందినిని వెంట తీసుకుని వెటర్నరీ డాక్టరు దగ్గరకు బయలుదేరాను. పనిలో పనిగా 'భార్యా బాధిత సంఘం'లోనూ మెంబర్‌షిప్ తీసుకోవాలి. నిన్న వెళ్తే పెద్ద క్యూ ఉంది. మళ్ళీ ఎప్పుడో వద్దాంలే అనుకుని వచ్చేశాను. ఇంక సాచివేత కుదర్దు. వాళ్లు నా సమస్యకు పరిష్కారం చెప్పకపోరు. పోనీ, మీకేమయినా పరిష్కారం తోచితే చెప్పండి - అదీ నా నందినికి విడాకులివ్వటం తప్ప!

★